భూసేకరణ పనులు వేగవంతం

నిరుద్యోగ యువతకు ఉపాధి

సోలార్, ఇండస్ట్రియల్ హబ్‌గా మడకశిర

మంత్రులు, అధికారుల వరుస పర్యటనలతో ఆశలు

గత ప్రభుత్వంలో ఆర్భాటం తప్ప.. ఆచరణ శూన్యం





ఆర్. అనంతపురం వద్ద పరిశ్రమల కోసం సేకరించిన భూములు

పరిశ్రమల వైపు అడుగులు

మడకశిర, మే 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అత్యంత వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు వేగంగా కార్యాచరణ కొనసాగుతోంది. మడకశిర ప్రాంతంలో పది రోజుల కిందట మంత్రులు అనగాని సత్యప్రసాద్, రవికుమార్, సత్యకుమార్ యాదవ్, సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పర్యటించి పరిశ్రమల కోసం స్థలాలను పరిశీలించారు. మడకశిరలో నియోజకవర్గంలో రూ. 15వేల కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల రైతుల జీవితాల్లో వెలుగు రావడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మడకశిరలో త్వరలోనే వక్క మార్కెట్ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నారు. బీడు భూములకు ఆర్థికంగా వెసులుబాటు రానుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం రెండో విడత భూసేకరణ కూడా అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు ఆ ప్రాంతాల్లో పర్యటించి భూసేకరణకు కావలిసిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మడకశిర వైపు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటన సందర్భంగా.. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విన్నవించారు. మడకశిర మండలం ఆర్.అనంతపురం వద్ద పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చుదిద్దుతామాని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే మడకశిర ప్రాంతానికి అతి పెద్ద సోలార్ పార్క్, డిఫెన్స్ పరిశ్రమలు రాబోతున్నట్లు మంత్రులు గొట్టి పాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, సవితమ్మ వెల్లడించారు. 15 రోజుల క్రితం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, అధికారులు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆర్.అనంతపురం వద్ద పరిశ్రమల ఏర్పాటుకు భూములను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం బీఈఎల్ మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం ఇప్పటి కే గౌడనహళ్లి పరిసర ప్రాంతాల్లో భూములను పరిశీలించింది.

వైసీపీ హయాంలో జాడలేని పరిశ్రమలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ నెలకొల్పలేదు. ఆర్భాటంగా ప్రకటనలు చేయడం తప్ప ఆచరణ ఏమీ కనిపించలేదు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమయిన మడకశిర నియోజకరవ్గంలో ఉపాధి అవకాశాలు లేక వేలాదిమంది నిరుద్యోగులు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. కరోనా సమయంలో స్వగ్రామాలకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమవుతుండడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేదని మండిపడుతున్నారు. మడకశిర మండలం ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, ఛత్రం పంచాయతీల పరిధిలో 2012లో పరిశ్రమల కోసం 1600 ఎకరాలు భూసేకరణ చేశారు. అందులో 760 ఎకరాలు ఏపీఐఐసీకి కేటాయించారు.

దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మడకశిర నియోజకవర్గానికి మంచిరోజులు వస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనతో ఒక్కసారిగా రూపురేఖలు మారే విధంగా చర్యలు ప్రారంభమయ్యాయి. పారిశ్రామిక అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. అతి పెద్ద సోలార్ పార్క్, డిఫెన్స్ పరిశ్రమ రాబోతున్నాయి. వీటితో పాటు గార్మెంట్స్ పరిశ్రమ, వక్కమార్కెట్‌తో వేలాది మందికి ఉపాధి లభించనుంది. బీడు భూములకు లీజు రూపంలో ఆర్థికంగా చేయూత లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడత భూసేకరణ వేగవంతం

మడకశిర ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పడం కోసం రెండోవిడత భూములు సేకరించడానికి అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వాటికి సంబంధించి వివరాలను సంబంధిత శాఖ అధికారులు సేకరించారు. మడకశిర మండలం గౌడనహళ్లి, ఛత్రం పంచాయతీల పరిధిలో భూములను ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పరిశీలించారు.



బుళ్లసముద్రం వద్ద సోలార్ ప్రాజెక్టుకు అధికారులతో కలిసి భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి (ఫైల్)

రూ.15వేల కోట్లతో అతిపెద్ద సోలార్ ప్రాజెక్టు



మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మడకశిర నియోజకవర్గంలో రూ. 15వేల కోట్లతో అతిపెద్ద సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నాం. సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 39ని విడుదల చేసింది. నవయుగ కంపెనీ తొలివిడతగా రూ.7500 కోట్లతో పనులు ప్రారంభించనుంది. హరేసముద్రం, వైబీ హళ్లి, బుళ్లసముద్రం, మనూరు, కల్లుమర్రి పంచాయతీ పరిధిలో సుమారు పది వేల ఎకరాలలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి వేలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. రెండువేల మెగావాట్ల సామర్థ్యంతో గుడిబండలో టాటా కంపెనీవారు సోలార్ పార్క్ ఏర్పాటుకు పరిశీలించారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం తిరుమణిలో ఎకరాకు రూ.21వేలు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో ఎకరాకు రూ.31వేలు లీజు ఇచ్చేవిధంగా జీవో ఇచ్చారు. బెంగళూరుకు దాదాపు 20వేల మంది వలస కూలీలుగా వెళుతున్నారు. వారందరికీ స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. డిఫెన్స్‌కు సంబంధించి పరిశ్రమకు త్వరలోనే శంకుస్థాపన చేస్తున్నాం. ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమ ప్రారంభించి మూడు వేల మందికి ఉపాధి కల్పిస్తాం.

- ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర

జోరుగా

డాలర్ దందా..!

- నిబంధనలు.. అనుమతులు లేవు
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



పుట్టపర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో జోరుగా డాలర్ల అక్రమ వ్యాపారం సాగుతోంది. సత్యసాయి మహాసమాధి దర్శనానికి విదేశీ భక్తులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. వారు తమ డాలర్లను భారతీయ కరెన్సీలోకి మార్చుకోవడానికి వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. దీంతో ఫారెక్స్ సెంటర్లు వెలిశాయి. ఇవే కాకుండా హోటళ్లు, వస్త్రదుకాణాలతోపాటు పలువురు వ్యాపారస్థులు డాలర్ల కొనుగోలును అదనపు వ్యాపారంగా చేసుకున్నారు. అనుమతులు లేకుండానే ఈ వ్యాపారం నిర్వహిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతోంది. ప్రతి ఏడాది డాలర్ మారకం ద్వారా కోట్లలో వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

అనుమతులు లేకుండానే..

విదేశీ కరెన్సీని భారతీయ కరెన్సీలోకి మార్పు చేసే వ్యాపారానికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. అయితే ఎలాంటి అనుమతులు లేకుండానే ఫారెక్స్ సెంటర్ అంటూ బోర్డులు తగిలించుకుని ప్రైవేటు వ్యక్తులు డాలర్లను కొనుగోలు చేస్తుంటారు. ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించకుండానే డాలర్ల క్రయ విక్రయాలు నిర్వహిస్తున్నారు. వచ్చిన విదేశీ కరెన్సీని బెంగళూరుకు తరలించి అధిక ధరలకు అమ్ముకుం టూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

ఎక్కువగా డాలర్, యూరోనే చెల్లుబాటు..

ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాలకు పైగా ఉన్న భక్తులు నిత్యం పుట్టపర్తికి వస్తుంటారు. వీరిలో ఎక్కువ శాతం యూరోలు, డాలర్లను త మ వెంట తెచ్చుకుంటారు. వీటిని అవసరమైనప్పుడల్లా రూపాయల్లోకి మార్చుకుం టారు. డాలర్‌కు పౌండ్‌కు మంచి ధర ఉన్నా ఇక్క డ వ్యాపారులు మాత్రం తగ్గించే భారత కరెన్సీ ఇస్తారు. బెంగళూరు కు వెళ్లి మార్చుకోవడం వ్యయప్రయాసలతో కూడి ఉండటంతో విదే శీ భక్తులు స్థానిక ఫారెక్స్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, మలేషియా, సింగపూర్, జపాన్, జర్మనీ, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇటలీ భక్తులు తరచూ పుట్టపర్తికి వస్తుంటారు. ఆయా దేశస్తులు తమ కరెన్సీని స్థానికంగా వ్యాపారస్థుల ద్వారానే మార్చుకుంటున్నారు. ఫారెక్స్‌సెంటర్లు, హోటళ్లు, వస్త్రదుకాణాలు విదేశీయులకు డాలర్లు మార్చి ఇస్తుంటారు. తద్వారా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా లబ్ధిపొందుతున్నారు.

మొద్దునిద్రలో అధికారులు



విదేశీ కరెన్సీని భారతీయ కరెన్సీలోకి మార్చే మార్కెట్‌పై సంబంధిత శాఖల నిఘా ఉం డటం లేదు. డాలర్ల వ్యాపారంపై జీఎస్టీ, కమర్షియల్‌టాక్స్, పోలీసుశాఖకూడా నిఘా కొరవడినట్లు తెలుస్తోంది. ఎప్పుడైనా విదేశీయుల డాలర్ల మారకంలో మోసం జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విదేశీ కరెన్సీ వ్యాపారం చట్టబద్ధంగా నిర్వహిస్తే పభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. సంబంధిత అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతోనే అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోందనే విమర్శలు వినవస్తున్నాయి.



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన చెన్నకేశవుడు

సూర్య, చంద్రప్రభ వాహనాలపై

ఊరేగిన చెన్నకేశవుడు

ధర్మవరం, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం, సాయంత్రం చెన్నకేశవుడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగాడు. చెన్నకేశవుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామికి ఉభయదాతలు పూజలు చేయించారు. ఊరేగింపులో అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య బృందం సంకీర్తనలను ఆలపించింది. మంగళవారం ఉదయం సర్వభూపాల వాహనం, సింహ వాహనాలలో స్వామివారిని ఊరేగిస్తామని ఆలయ అడహక్ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవుడు

ఎన్టీఆర్ రెండో పుట్టినిల్లు పురం

నియోజకవర్గ అభివృద్ధికి రూ.400 కోట్లు తెచ్చా..

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

మంత్రి అనగానితో కలిసి పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ



సభకు హాజరైన జనం



పొజిషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యే బాలకృష్ణ, నందమూరి వసుంధరాదేవి, కలెక్టర్ చేతన్

హిందూపురం, మే 5(ఆంధ్రజ్యోతి): తన తండ్రి ఎన్టీఆర్‌కు హిందూపురం రెండో పుట్టినిల్లు అని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. కొల్లకుంట ఇందిరమ్మ కాలనీలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి 230 మందికి సోమవారం ఆయన పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. రాయలసీమ గడ్డే తన అడ్డా అని, ఇక్కడి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని అన్నారు. తన తండ్రి సొంతూరు నిమ్మకూరే అయినా హిందూపురం నుంచే ఎన్నికల్లో పోటీ చేశారని, ఏ కార్యక్రమమైనా ఇక్కడి నుంచే ప్రారంభించేవారని అన్నారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవాకు పురుడుపోసింది ఆయనేనని అన్నారు. ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన రోజే సీమకు కృష్ణాజలాలు ఇవ్వాలని సంకల్పించారని, చంద్రబాబు దానిని పూర్తి చేశారని అన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి ఏడాదిలోపే రూ.400 కోట్లు నిధులు తీసుకువచ్చానని, ఇప్పటికే రూ.80కోట్లతో ఉపాధి పథకం కింద పనులు జరిగాయని తెలిపారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పైప్‌లైన్ కోసం రూ.92 కోట్లు, అహుడా కింద రూ.15 కోట్లు, గుడ్డం కోనేరు అభివృద్ధిని కలుపుకుని సుమారు రూ.400కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామని తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉన్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నామని, దీనివల్ల రెండేళ్ల తరువాత ఇళ్ల క్రయవిక్రయాలకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో తన సతీమణి వసుంధరాదేవితో కలిసి పాల్గొన్నారు.

బడుగుల కోసం పుట్టిన పార్టీ : మంత్రి అనగాని సత్యప్రసాద్

బడుగు, బలహీనవర్గాల కోసం టీడీపీ ఆవిర్భవించిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర విభజన తరువాత అభివృద్ధి పదేళ్ల వెనక్కు వెళ్లిందని అన్నారు. చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నారని అన్నారు. యువత నేత లోకేశ్, హిందూపురంలో బాలకృష్ణ ఎంతగానో కష్టపడుతున్నారని అన్నారు. వైసీపీ హయాంలో పాత ఇళ్లకు ఇచ్చిన వన్‌టైం సెటిల్‌మెంట్‌ను రద్దుచేసి ఉచితంగా పట్టాలు ఇస్తామని అన్నారు. బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం సంతోషకరమని మడకశిర ఎమ్మెల్యే రాజు అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణ కష్టపడుతున్న తీరు అమోఘమని అన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేయడానికి బాలకృష్ణ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ కాలనీలో 2019 కంటే ముందున్నవారికి ఇంటిపట్టా రాకపోతే పొజిషన్ సర్టిఫికెట్లు పొందాలని కలెక్టర్ చేతన్ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నందమూరి వసుంధరాదేవి, మున్సిపల్ చైర్మన్, రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, లీగల్ సెల్ నాయకుడు శివశంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే

టీడీపీ ధ్యేయం

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఈరన్న, సంజీవప్ప రెండు నెలల క్రితం ప్రమాదంలో మృతిచెందారు. వారిరువురు టీడీపీ సభ్యత్వం తీసుకోవడంతో పార్టీ నుంచి ఒక్కొక్కరికి రూ.5లక్షల బీమా మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకు మంత్రి సవిత సోమవారం అందజేశారు. టీడీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

వైసీపీ చీప్ పాలిటిక్స్‌ను తిప్పికొట్టేందుకు సిద్ధం

వైసీపీ ఉనికి కోసం చీప్ పాలిటిక్స్ చేస్తోందని, వాటిని తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి సవిత అన్నారు. అమరావతి సభ విజయవంతం కావడంతో ప్రజలు సంతోషపడుతున్నారని అన్నారు. గత పాలకులు అమరావతి భ్రమరావతి అని ఎగతాళి చేశారన్నారు. ఐదేళ్లపాటు రాజధాని ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు.. చంద్రబాబు పునఃనిర్మాణానికి కంకణబద్ధులయ్యారన్నారు. అమరావతి సభలో స్వయంగా ప్రధాని మోదీనే చంద్రబాబు పనితనాన్ని మెచ్చుకుని, దేశం గర్వించేలా చేశారన్నారు. ప్రపంచంలోనే అమరావతి మొదటి స్థానంలో ఉంటుందన్నారు.

కార్డు కష్టాలు

- సచివాలయాలకు వెళ్లలేకపోతున్న వృద్ధులు
- ఇంటి వద్దనే చేయాలని కోరుతున్న పండుటాకులు

ధర్మవరం, మే 5(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, వేధిస్తున్న ఆరోగ్య సమస్యలతో సచివాలయాలకు వెళ్లలేక పలువురు వృద్ధులు సీనియర్ సిటిజన్ కార్డులు పొందలేకపోతున్నారు. జిల్లాలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు ఎక్కువగానే ఉన్నారు. గ్రామాలు, పట్టణాల్లో సచివాలయాలు ఇంటికి సుదూరంగా ఉండటంతో ఎండకు వెళ్లడానికి జంకుతున్నారు. కొన్ని సచివాలయాల్లో ఉదయం11 గంటల వరకు సిబ్బంది రావడం లేదు. ఒకవేళ వచ్చినా రకరకాల పనులు, ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. దీంతో వృద్ధులు అక్కడ గంటల తరబడి నిరీక్షించలేకపోతున్నారు. 60 సంవత్సరాలు దాటిన వారికి కొన్ని రోజుల నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డులను ఇస్తున్నారు. వృద్ధులు ఆధార్ జిరాక్స్, పాసుపోర్టు సైజుఫొటో, బ్లడ్‌గ్రూపు, ఆధార్‌లింక్ మొబైల్ నెంబరు తీసుకుని వచ్చిన వారికి దరఖాస్తు ఇచ్చి, పూర్తి చేయించి సచివాలయ సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో ప్రభుత్వ లోగోతో సీనియర్ సిటిజన్ కార్డు మంజూరు అవుతుంది. అందులో వృద్ధుడు/ వృద్ధురాలి పేరు, పుట్టిన తేదీ, మాస్క్‌డ్ ఆధార్ నంబరు, సీనియర్ సిటిజన్ కార్డు నంబర్, బార్ కోడ్, చిరునామా, కాంటాక్టు నంబరు, అత్యవసరమైతే సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, మొబైల్ నంబరు, ఎమర్జెన్సీ నంబర్లు పొందుపరచి ఉంటాయి.

ప్రయోజనాలు ఇవే..

సీనియర్ సిటిజన్ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నాయి. వృద్ధాప్య, పింఛన్ పొందాలంటే ఈ కార్డు ఉంటే సరిపోతుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్ కార్డు చూపించి టిక్కెట్ చార్జీలో రాయితీ పొందవచ్చు. బ్యాంకుల్లో వృద్ధులకు ప్రత్యేకించి అధికవడ్డీ చెల్లించే డిపాజిట్ పథకాలకు కూడా ఈ కార్డు ఉపయోగ పడుతుంది. ఈ ఉపయోగాల దృష్ట్యా సీనియర్ సిటిజన్ కార్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఇళ్ల వద్దనే పింఛన్‌ను పంపిణీ చేస్తున్నట్లుగానే సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు.



తెలియదు: చిన్నన్న, వృద్ధుడు, ముదిగుబ్బ

సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డు కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలియదు. ప్రభుత్వం మాలాంటి ముసలోల్లకి మంచి అవకాశం కల్పిస్తుంటే చెప్పకపోవడం దారుణం. ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియదు. సచివాలయం వద్దకు పోలేని వారి పరిస్థితి ఏమిటో? వీటిపై అధికారులు స్పందించాలి.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి


వేణుగోపాల్ (ఫైల్)

నల్లమాడ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవంకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేణుగోపాల్(47) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేణుగోపాల్ ఆదివారం ఉదయం గోరంట్లలో ఓ వివాహానికి ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి బయల్దేరారు. ఓబుళదేవరచెరువు మండలంలోని గౌరాపురం వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పండింది. ప్రమాదంలో వేణుగోపాల్ తలకు బలమైన గాయమైంది. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. అనంతపురం ఆసుపత్రిలోనే వేణుగోపాల్ మృతదేహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వేణుగోపాల్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అసభ్యకరంగా బాలిక ఫొటోలు

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికను గుట్టకిందపల్లికి చెందిన నరసింహులు అనే యువకుడు అసభ్యకరంగా సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. దీంతో రూరల్ పోలీసులు పోక్సో చట్టంకింద కేసు నమోదు చేశారు. సోమవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుట్టకిందపల్లికి చెందిన నరసింహులు అనే యువకుడు పెయింటింగ్ పనిచేసేందుకు పట్టణ సమీపంలోని ఓ గ్రామంలోకి వెళ్లాడు. అక్కడ సమీపాన నాలుగేళ్ల బాలికను పిలిచి అసభ్యకరంగా ఫొటోలు తీశాడు. దీనిని గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక తల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు నరసింహులుపై పోక్సో కింద నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నరసింహులు పరారీలో ఉన్నాడు.

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడులు


సీజ్ చేసిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు సోమవారం ఉమ్మడి జిల్లాలో దాడులు నిర్వహించారు. గాండ్లపెంటలోని పీరాసాహెబ్‌కు చెందిన ఎఫ్‌పీ షాపును తనిఖీ చేశారు. అధికంగా స్టాకు ఉన్నట్లు గుర్తించామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. నిల్వలను జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, గాండ్లపెంట ఆర్‌ఐ అశోక చక్రవర్తి పాల్గొన్నారు. సీఐ జమాల్‌బాషా ఆధ్వర్యంలో గార్లదిన్నె మండలంలోని తలగాసిపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న 315 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌చేశారు. కేసు నమోదు చేసుకొని స్థానిక సీఎస్‌డీటీ హరిప్రియకు అప్పగించారు. బియ్యం యజమాని చింతలయ్య, డ్రైవర్ అక్బర్ బాషా, క్లీనర్ సుబ్బరాయుడును అదుపులోకి తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ జమాల్ బాషా తెలిపారు. తనిఖీల్లో ఏఈఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో బీటెక్ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్15, 19) సప్లిమెంటరీ నిర్వహించామన్నారు. ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు తృతీయ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ పరీక్షలు పెట్టామన్నారు. వాటి ఫలితాలను విడుదల చేశామన్నారు. విద్యార్థులు ఫలితాలకోసం https://jntuaresults.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శివకుమార్, అసిస్టెంట్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ శంకర్‌శేఖర్, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

ఒంగోలు క్రైం, మే5 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్, ఇళ్లలో దొంగతనాలు చేయడంలో అందెవేసిన ముఠాను ప్రకాశం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. దొంగతనం చేసి కారులో వెళుతుండగా, ఆపే ప్రయత్నం చేసిన ఎస్‌ఐ జీపునే ఢీకొట్టి తప్పించుకున్న ముఠా అది. నిందితు లనుంచి రూ.85లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, ఆరు కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా ఇటీవల ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం, అన్నమయ్య జిల్లాలో 16 చోట్ల దొంగతనాలు చేసిందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. నిందితులలో కడప జిల్లాకు చాపాడు మండలం ఖాదర్‌పల్లికి చెందిన ఛీమపర్తి ఫక్రుద్దీన్ అలియాస్ పోగోడు, అలియాస్ బొండ్డాడు, ఇంకా చింపర్తి అలియాస్ సింపతి మహబూబ్ పీరా, ప్రొద్దుటూరుకు చెందిన గాండ్ల లతీఫ్ బాషా ఉన్నారు.

'అనంత'పై సీఎంకు ప్రత్యేక శ్రద్ధ

- రెట్టింపు నీటిని తీసుకురావడానికి చర్యలు
- 9న ఉరవకొండలో చంద్రబాబు పర్యటన
- ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- కలెక్టర్, ఎస్పీతో కలిసి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్, కలెక్టర్, ఎస్పీ

ఉరవకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, ఈ రోజు కళ్ల ముందు అది కనిపిస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం చిన్నముష్టూరు, చాయాపురం గ్రామాల వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలిసి పరిశీలించారు. హంద్రీనీవా అధికారులతో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఛాయాపురంలో సీఎం పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, గ్రామసభ జరిగే ప్రదేశాలను కలెక్టర్, ఎస్పీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన సీఎం ఉరవకొండ నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారని తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి చిన్నముష్టూరు, చాయాపురం గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించామన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పుతో సామర్థ్యాన్ని పెంచి, రెట్టింపు స్థాయిలో నీటిని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. జూలై 10వ తేదీలోపు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. గత పాలకులు ఎక్కడా నిర్మాణాలు కట్టకుండా కేవలం ఒక పంపుతో నీటిని హడావుడిగా విడుదల చేస్తే.. టీడీపీ హయాంలో అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమాను తీసుకువచ్చి.. ఆరు పంపులతో నీటిని తీసుకెళ్లిన ఘనత తమదే అన్నారు. ఏ గ్రామం వద్ద పనులు జరుగుతున్నాయో అక్కడే గ్రామ సభ ఉంటుందన్నారు. ఆ గ్రామంలోని మహిళలు, యువకులతో సీఎం మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, ఆర్ అండ్‌బీ ఎస్ఈ రాజ్‌గోపాల్, తహసీల్దార్లు మహబూబ్‌బాషా, నరేష్, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, మండల కన్వీనర్లు నూతేటి వెంకటేష్, విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ టీడీపీ నాయకులు నాగేంద్ర, యర్రగుంట్ల వెంకటేష్, నాగన్న, ముష్టూరు రాంబాబు, ఎర్రిస్వామి, అనంతయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు ప్రజలకు వరం

● కొనసాగించేలా ఉద్యమిద్దాం ● అఖిలపక్ష కమిటీ పిలుపు


రిలేదీక్షలో మాట్లాడుతున్న సాకే హరి, మద్దతు తెలిపిన నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): రూరల్ డెవప్‌మెంట్ ట్రస్ట్ జిల్లా ప్రజలకు వరమని, ఆ సంస్థ సేవలను కొనసాగించేలా సమన్వయంతో ఉద్యమిద్దామని ప్రజా సంఘాలు, రాజకీయపార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమీపంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద సోమవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నిరుపేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్ఏ) అనుమతి కొనసాగించాలని కోరుతూ కమిటీ కన్వీనర్ సాకే హరి అధ్యక్షతన రిలే దీక్షలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజగోపాల్, జర్నలిస్టు నాయకుడు మచ్చా రామలింగారెడ్డి తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు నివాస గృహాలు, ఆహారాన్ని అందించాలని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆర్డీటీని ప్రారంభించారని, విద్య, వైద్యం కూడా తప్పనిసరిగా భావించి విదేశీ దాతల సాయాన్ని ఆర్థించి సేవలను విస్తరించారని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ రూ.వందల కోట్లు వెచ్చించి అధునాత భవనాలను ఆర్డీటీ నిర్మించిందని గుర్తు చేశారు. ఆర్డీటీ సేవలను కొనసాగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రామకృష్ణ, గంగాధర్, కేపీ రాజు, రామన్న, సుగమంచి శ్రీనివాసులు, బాలపెద్దన్న, టీపీ రామన్న, ఐఎంఎం బాషా, ఆనంద్, హరినాథ్‌రెడ్డి, వంశీకృష్ణ, రామాంజినేయులు, కృష్ణారెడ్డి, గోవర్ధన్, సూర్యనరాయణ, కాటమయ్య, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీరంగనాథ వైభవం నాటిక


నాటికలోని సన్నివేశాలు

పుట్టపర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం భక్తులు చేపట్టిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపచేశాయి. సోమవారం సాయంత్రం సాయి కుల్వంతు సభామండపంలో సాయియువత శ్రీరంగనాథవైభవం నాటికను ప్రదర్శించింది. పాత్రధారులు నాటికలోని ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ సేవాసంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. రాత్రి పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. ప్రశాంతి నిలయం గేటు వరకు నగర సంకీర్తన సాగింది. కోలాటం, చెక్క భజన, భక్తిపాటలతో వేలాది మంది శ్రీకాకుళం భక్తులు పాల్గొన్నారు.

వర్సిటీలకు దండిగా నిధులు..!

- ఏడాదికి సరిపడా జీతభత్యాలు
- ఎస్కేయూకు రూ.100 కోట్లు, జేఎన్టీయూకు రూ.58.97 కోట్లు మంజూరు
- ఉద్యోగుల హర్షం


జేఎన్టీయూ ముఖద్వారం

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత వర్సిటీల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమకావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధులను మంజూరు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న వర్సిటీలకు రూ.1200 కోట్లు నిధులు మంజూరు చేయగా.. అందులో ఎస్కేయూకు రూ.100 కోట్లు, జేఎన్టీయూకు రూ.58.97 కోట్లు కేటాయించింది. ఉద్యోగుల ఖాతాల్లో శనివారం జీతాలు జమ అయ్యాయని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఎదురుచూపులకు స్వస్తిచెబుతూ ఈ నెల 3వ తేదీనే ఖాతాల్లో జీతాలు జమకావడం ఆనందంగా ఉందని వర్సిటీల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్రైమాసికం వారీగా నిధుల మంజూరు వివరాలు రూపాయల్లో...

త్రైమాసికం	జేఎన్టీయూ	ఎస్కేయూ
ప్రథమ	20,64,07,950	35,04,87,550
ద్వితీయ	11,79,47,400	20,02,78,600
తృతీయ	11,79,47,400	20,02,78,600
నాల్గవ	14,74,34,250	25,03,48,250
మొత్తం	58,97,37,000	100,13,93,000

త్రైమాసిక కేటాయింపులు విడుదల

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో వర్సిటీలకు కేటాయించిన నిధులను మూడు నెలలకు కలిపి త్రైమాసికానికి(క్వార్టర్లీ) ఒకసారి ఆర్థిక శాఖ విడుదల చేస్తుంది. ఈ నిధులు నెలనెలా జీతాల కింద ఉద్యోగులకు జమ అవుతాయి. ఇలా సంవత్సరంలో నాలుగు త్రైమాసికాలకు మొత్తం నిధులు విడుదలయ్యేవి. గతంలో కేటాయించిన నిధులను సకాలంలో మంజూరుచేసేవి. వైసీపీ పాలన ఐదు సంవత్సరాల్లో మాత్రం వర్సిటీల చరిత్రలో ఎన్నడూలేని విధంగా జీతాల నిధులకు కోతపెడుతూ వచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించినా అవి పేపర్లకే పరిమితమయ్యేవి. ప్రభుత్వానికి వెసులుబాటు కలిగినప్పుడు కొత్త మొత్తం జమచేస్తూ వచ్చేది. దీంతో నెలల తరబడి జీతాల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని వర్సిటీ ఉద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు.


ఎస్కేయూ ముఖద్వారం

ఏడాదికి సరిపడా జీతభత్యాలతో హర్షం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆర్థిక అంశాల్లోనూ సానుకూల వాతావరణం నెలకొంది. 2025-26 బడ్జెట్ కేటాయింపుల వారిగా నిధులు మంజూరు కావడం ఇందుకు నిదర్శనమని వర్సిటీల ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాదికి సరిపడా జీత, భత్యాల నిధులను మంజూరు చేశారు. అందులో నుంచి మొదటి త్రైమాసికం (ఏప్రిల్, మే, జూన్) మొత్తాలు ఎస్కేయూకు రూ.35.04 కోట్లు, జేఎన్టీయూకు రూ.20.64 కోట్లు విడుదలయ్యాయి. మిగిలిన మొత్తాలు ఆయా త్రైమాసికాల వారిగా కేటాయించిన విధంగా విడుదల వుతాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఎదురు చూడాల్సిన అవసరం లేదు

ఈ ఆర్థిక సంవత్సరంలో జీతాల కోసం ఎదురుచూడాల్సిన పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వం సరిపడా నిధులను మంజూరు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన జీత, భత్యాల నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రతి నెలా అడ్వాన్స్ నిధుల కోసం లేఖలు రాసి ఎదురు చూడాల్సి వచ్చేది. రెండు, మూడు నెలలకు ఒకసారి విడుదలయ్యేవి. దీంతో చిరుద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నిధులు ఇంకా రావాల్సివుంది. అవికూడా విడుదలైతే పూర్తిస్థాయిలో జీత, భత్యాల సమస్యలు తొలగిపోయినట్టే.

-ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డాక్టర్ రమేష్‌బాబు, జేఎన్టీయూ, ఎస్కేయూ రిజిస్ట్రార్లు

అతిథులు ఖరారు

- డాక్టర్ సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్
- ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్
- 17న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవ గౌరవ డాక్టరేట్‌కు హైదరాబాద్ లారస్ ల్యాబ్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ, ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ నారాయణ పేర్లు ఖరారయ్యాయి. గవర్నర్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు సోమవారం తెలిపారు. ఈ నెల 17న జేఎన్టీయూ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

డాక్టర్ సత్యనారాయణ ఎవరంటే..



ఆంధ్రా యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగం పీహెచ్‌డీ పూర్తిచేసిన డాక్టర్ సత్యనారాయణ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబీఏ పట్టాను పొందారు. పరిశోధనాభివృద్ధి, అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ ప్రక్రియ, తయారీ, నాణ్యత నియంత్రణ, వ్యాపారాభివృద్ధి, సప్లై చైన్, మేధో సంపత్తి రంగాల్లో ఆయన 30 సంవత్సరాలు అనుభవాన్ని ఘడించారు. ఫార్మసీ రంగంలో 150 పేటెంట్స్‌ను సొంతం చేసుకున్నారు. స్వదేశంతోపాటు విదేశాల్లోనూ సేవలందిస్తూ కొత్త రకం ఔషధాలను కనుకున్నారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి పలు రూపాల్లో ఉచిత సేవలు అందించారు.

అంతర్జాతీయ పరిశోధకుడు మాధవ్



సివిల్ ఇంజనీర్‌గా ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ 1960లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీటెక్‌లో పట్టభద్రులయ్యారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) నుంచి ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఐఐటీ కాన్పూర్‌లో అధ్యాపక జీవితాన్ని ప్రారంభించారు. ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, బెల్జియం, యూకే తదితర దేశాల్లోని యూనివర్సిటీల్లో సేవలు అందించారు. జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో 30కిపైగా డాక్టోరల్, మాస్టర్ థీసీస్‌లు సొంతం చేసుకున్న ప్రాజెక్టులకు గైడ్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ పరిశోధకుడిగా గుర్తింపు పొందారు. హైదరాబాద్ జేఎన్టీయూలో జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో పరిశోధనా కళాశాలను స్థాపించారు. ఐఐటీ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొంది, హైదరాబాద్ జేఎన్టీయూలో ఎమెరిటస్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

నిర్ధేశించిన రుసుమే వసూలు చేయాలి

- ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఉంచాల్సిందే
- లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీపీఓ ఆదేశాలు


లైసెన్స్‌డ్ సర్వేయర్లతో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారిక, అనధికారిక లేఅవుట్స్, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. సోమవారం డీపీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఉంచాల్సిందే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనధికార లేఅవుట్స్‌కు సంబంధించి కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యదర్శులు భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో ఉండేలా చూడాలన్నారు. తనిఖీల్లో లోపాలు వెలుగులోకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ హరీష్‌తో పాటు లైసెన్స్ సర్వేయర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

13న మెగా జాబ్‌మేళా: మంత్రి సవిత


పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి సవిత, టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావుతో కలిసి మెగా జాబ్‌మేళాలకు సంబంధించిన పోస్టర్లను మంత్రి సోమవారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 50కిపైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 2వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. వివరాలకు 9966682246, 9398811689 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

అభివృద్ధిని ప్రజలకు వివరించండి :ఎమ్మెల్యే

కదిరి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం నల్లచెరువులోని గీతామందిరంలో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంతో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా మండల కార్యకర్తల సమావేశం నిర్వహించి.. సమస్యలు చర్చించుకోవాలన్నారు. నీటి ఎద్దడి, ఇతర సమస్యలను కార్యకర్తలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకురాలు షర్వీనాభాను, నాయకులు దాదెం శివారెడ్డి, నాగభూషణం నాయుడు, ఖాదర్, మాబూసాబ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలకు విరాళం

కదిరిఅర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): మొటుకుపల్లి వద్ద ఆర్డీటీ నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలకు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మోకా హరిమోహన్ రూ.పదివేలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆర్డీటీసంస్థ ప్రతినిధి రెడ్డెప్పకు అందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



శ్రీసత్యసాయి జిల్లా జట్టు

కదిరిఅర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు జిల్లా మార్కాపురంలో ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన 54వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు ప్రతిభ చాటి రెండో స్థానంలో నిలిచింది. జిల్లా క్రీడాకారులు నక్షత్ర, సభాఖాన్, పేట్రీస్, సరిత, ఝాన్సీరాణి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు.

కలెక్టరేట్‌లో ఆర్గానిక్ మార్కెట్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ మార్కెట్

పుట్టపర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణంలో ఆర్గానిక్ మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సోమవారం తెలిపారు. రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ఉత్పత్తులు, ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాలు సాగు చేసిన వేరుశనగ, కొర్రలు, సాములు, పరకలు, జొన్నలు, కూరగాయలను కలెక్టరేట్ ఆవరణంలో ఇకనుంచి ప్రతి సోమవారం విక్రయానికి ఉంచుతున్నట్లు చెప్పారు.

బాల్యవివాహాలతో అనర్థాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

కదిరిలీగల్, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక నిజాంవలి కాలనీలో మహిళా బీడీ కార్మికులకు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అనుసంధాన కర్తలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్య వివాహం చట్టరీత్యానేరమని, దాన్ని అడ్డుకోవడానికి సహకరించాలని కోరారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో న్యాయ అను సంధాన కర్త లింగాల లోకేశ్వరరెడ్డి, కార్మికశాఖ ప్రతినిధి సరస్వతి, రైడ్స్ సంస్థ ప్రతినిధులు మెహతాజ్, అమ్మజాన్, ఎలక్ట్రికల్ వైర్‌మన్ జాఫర్ పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి




ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

తనకల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలని మండలంలోని చీకటిమానుపల్లి, బొంతపల్లి, గేమేనాయక్‌తండా, కోటపల్లి తదితర గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆశయ సాధన కమిటీ చైర్మన్ తోపు పారేసు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, వేమనారాయణ, నరసింహులు, హర్షవర్ధన్, నరేష్, క్రిష్టప్ప, సురేష్, రమణనాయక్, రమణమ్మ, ఆంజనమ్మ, కొండయ్య, గంగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఓబుళదేవరచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. కొత్తపల్లి అయ్యప్పస్వామి ఆలయం 13వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా విద్యాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, శివాలయంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాట్‌కు అభిషేకించారు.



అలంకరణలో అయ్యప్పస్వామి

మద్దిలేరు వంతెన ఎప్పుడు పూర్తయ్యేనో...?

● తాత్కాలికంగా మట్టితోనే సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం ● నిర్మాణం పూర్తయితే 25 గ్రామాలకు మోక్షం

ముదిగుబ్బ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిలేరు వంతెన నిర్మాణం కోసం వేలాది మంది ఎదురు చూస్తున్నారు. వంతెన పూర్తిగా కొట్టుకుపోయి ఇప్పటికి ఐదేళ్ళు గడుస్తున్నా కొత్తది నిర్మించలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నల్లమాడ నుంచి పులివెందుల వైపు, తలుపుల మండలానికి ఈ వంతెనపై నుంచే వెళ్లాలి. కదిరి నుంచి మల్లేపల్లికి ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి ఆర్టీసీ బస్సు తిరుగుతోంది. లో లెవెల్ వంతెన కావడంతో మద్దిలేరు వాగు ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ముదిగుబ్బ, తలుపుల మండలాలలో దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు ఆగిపోతాయి. మరో 10 కిలోమీటర్లు చుట్టేసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

● వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

ముదిగుబ్బ-కదిరి సరిహద్దులో ఉన్న మద్దిలేరు వంతెన 2021లో నివార్ తుఫాన్‌కు పూర్తిగా కొట్టుకుపోయింది. సిమెంటు పైపులు, రాళ్ళు, మట్టి వేసి తాత్కాలికంగా మరమ్మత్తులు చేశారు. మళ్లీవర్షాలకు ఆమట్టి కొట్టుకుపోతూనే ఉంది.

● ఈ ప్రభుత్వమైనా పట్టించుకునేనా

మద్దిలేరు వాగుపై హై లెవెల్ వంతెన నిర్మించేందుకు పంచాయితీరాజ్ అధికారులు ఏడాదిన్నర కిందట రూ. 7.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మలకవేముల క్రాస్‌కు వెళ్ళే రెండో వంతెన దగ్గర మరో వంతెన నిర్మించేందుకు రూ. 4 కోట్లతో ప్రతిపాదించారు. నేటికి నిధులు మంజూరు కాలేదు. రానున్న వర్షా కాలంలో మద్దిలేరు వాగు ప్రవహిస్తే మళ్లి వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు వాగుపై వంతెన నిర్మిస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప... అమలులో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, వంతెన నిర్మించాలని 25 గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



తాత్కాలిక వంతెనపై వెళ్తున్న మల్లేపల్లి బస్సు



పైపుల మధ్య కొట్టుకుపోయిన మట్టి

ఉన్నతాధికారులకు చెప్పాం



మద్దిలేరు వంతెన నిర్మించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. వారు ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు. వర్షాకాలం సమీపిస్తోంది. వంతెన ప్రమాదకరంగా ఉంది. నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలి.

-నరసింహ యాదవ్, మద్దన్నగారిపల్లి

వెళ్లాలంటే భయమేస్తోంది



ఈ వంతెనను తాత్కాలికంగా మట్టితో నిర్మించారు. వర్షాలు పడినప్పుడల్లా ఆ మట్టి కొట్టుకొని పోతోంది. వంతెనపై రోడ్డు చిన్నదిగా అవుతోంది. ఓ వాహనం మాత్రమే వెళ్లేలా ఉంది. ఈ వంతెనపై వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పినా ఘోర ప్రమాదం జరిగే అవకాశముంది. వెళ్లాలంటే భయమేస్తుంది. త్వరగా శాశ్వత వంతెనను నిర్మిస్తే మేలు.

- చిన్న శ్రీనివాసులు, పైపేడు

ప్రతిపాదనలు పంపాం

మద్దిలేరు వాగుపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాం. హై లెవెల్ వంతెన నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే వంతెన పనులు చేపడతాం.

-రాజేంద్ర ప్రసాద్, పీఆర్ ప్రాజెక్ట్ ఏఈఈ, కదిరి





ధర్మవరం, కదిరి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్మవరం, కదిరి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. పీఆర్‌సీ కమిటీని వెంటనే వేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని, 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాలను ఆయా తహసీల్దార్లకు అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలి: సీపీఎం

పుట్టపర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులందరికి ఇంటిస్థలాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యనిర్వాహక వర్గసభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాలోని పేదలు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాల పంపిణీని ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, రైతు,సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లిపెద్దన్న, నాయకులు నరసింహులు, దిల్‌షాద్, బాళ్ల అంజి, బాబావలి పాల్గొన్నారు.

పెన్షనర్ల కార్యవర్గం ఏకగ్రీవం



సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మవరం, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో తాలూకా సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఏకిల చలపతి, ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా రామయ్య, కోశాధికారిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా నారప్ప, శ్రీరాములు, శివలింగన్న, కొండయ్య, రామచంద్రప్ప, సహాయకార్యదర్శులుగా శ్రీనివాసులు, వెంకటస్వామి, రామిరెడ్డి, కుళ్లాయప్ప, కేశవయ్యను ఎంపిక చేశారు.

కిశోరి బాలికలకు శిక్షణ



కొక్కంటిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తనకల్లు, మే5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో సోమవారం కిషోరి బాలికలకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. కొక్కంటి సర్పంచ్ వైవి. మలేశ్వరీ మాట్లాడుతూ.. కిషోర్ బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ఎంపీహెచ్ఓ సక్రేణ, అంగన్‌వాడీ కార్యకర్తలు జబీన్‌తాజ్, భాగ్యలక్ష్మీ, వెంకటలక్ష్మీ, ఆశ, సిద్ధమ్మ, పలువురు గ్రామస్తులు, మహిళలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

కొత్తచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. మండలంలోని బైరాపురం గ్రామంలో రైతు భాస్కర్‌రెడ్డి పొలంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. భూసార పరీక్ష వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు సనావుల్లా, స్వయం ప్రభ, వ్యవసాయ అధికారులు నటరాజ్, రవీంద్ర, వీఏఏలు, సర్పంచ్ రవికుమార్, స్థానికులు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై విగ్రహాలను తరలించాలి

కొత్తచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో విగ్రహాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. ఆ విగ్రహాలు తగిలి అనేక మంది గాయపడుతున్నారు. ఆ విగ్రహాలను బుక్కపట్నం చెరువు కట్టపైకి తరలించి.. ట్యాంక్ బండ్ తరహాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.. అని మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న సోమవారం తహసీల్దార్ నీలకంఠారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే కొత్తచెరువు సమీపంలోని శ్మశాన వాటికలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

● పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 70 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● పుట్టపర్తి : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 236 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ప్రజల నుంచి ఈ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారధి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆర్డీవో వీవీఎస్ శర్మకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. చిన్న చిన్న కేసులకు కండక్టర్లు, డ్రైవర్లను సస్పెండ్ చేస్తున్నారని, ఇంధన పొదుపు పేరుతో డ్రైవర్లను వేధిస్తున్నారని, ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ బైరిశెట్టి, ఓబులేసు, ప్రభాకర్‌రెడ్డి, నారాయణస్వామి, రవీంద్ర పాల్గొన్నారు.



కదిరి: ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కేతిరెడ్డి హయాంలో కబ్జాలు, దౌర్జన్యాలు

ధర్మవరం, మే 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హయాంలో జరిగిన కబ్జాలు, దౌర్జన్యాలు, దందాలు, అవినీతి నుంచి ఇప్పుడిప్పుడే ధర్మవరం పట్టణం కొలుకుంటోందని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం ఏన్‌డీఏ కార్యాలయంలో బీజేపీ మండల కన్వీనర్ గొట్లూరు చంద్ర, నాయకురాలు కంచం లీలావతి మాట్లాడారు. పట్టణ ప్రజలు వైసీపీ ప్రభుత్వ పాలనలో తాగునీటి కొరత, మురుగునీటి సమస్యలు, రహదారులు శిథిలం.. తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం మంత్రి సత్యకుమార్‌యాదవ్ అమృత్‌సర్ పథకం ద్వారా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నారని, కేంద్రం నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబిలేసు, చంద్రమౌళి, పోతుల నాగేపల్లి లక్ష్మీనారాయణ, అనిల్‌గౌడ్, పోతుకుంటరాజు, డోలా రాజారెడ్డి, నబీరసూల్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

బత్తలపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్‌కు చెందిన అరుంధతి కుమార్తె రమ్య కొంత కాలంగా వెన్నెముక సమస్యతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు తాళ్ళూరి సతీష్ సోమవారం వారి ఇంటికి వెళ్లి రూ. 10 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంగానాయుడు, కిరణ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

గాండ్లపెంట, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరెడ్డివారిపల్లిలో లైన్‌మన్ గోవిందు ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం అమర్చుతుండగా పైనున్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలాయి. ఈ ప్రమాదంలో గోవింద్ వీపు కాలిపోయింది. అలాగే విద్యుత్ పరికరాలు అందిస్తున్న రైతు శివారెడ్డికీ విద్యుత్ షాక్ తగలడంతో అతని కాలికి గాయమైంది. వీరిని ఆ గ్రామస్థులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి ...

బత్తలపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రయపల్లి వద్ద సోమవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పూలకుంటకు చెందిన రగునాథ్‌రెడ్డి, చియ్యేడుకు చెందిన క్రిష్ణారెడ్డి బైక్‌లో పూలకుంటకు బయలుదేరారు. యర్రయపల్లి క్రాస్ వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. అలాగే కారులోని బెంగళూరుకు చెందిన సంజయ్ కుమార్ కుమారుడు ఐదేళ్ల దిపన గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ సోమశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి.. తన జీపులో గాయపడ్డవారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు.

కార్లు ఢీ



బోల్తాపడిన కారు

ధర్మవరం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడంపల్లి క్రాస్ సమీపంలో సోమవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అనంతపురం పట్టణం అరవిందనగర్‌కు చెందిన కిషోర్‌కుమార్ తన కారులో పుట్టపర్తి నుంచి అనంతపురం బయలుదేరాడు. కొత్తచెరువుకు చెందిన సత్యనారాయణరావు అనంతపురం నుంచి తన కారులో కొత్తచెరువుకు బయలుదేరాడు. గరుడంపల్లి క్రాస్ సమీపంలో కిషోర్‌కుమార్ కారును సత్యనారాయణరావు కారు ఢీకొంది. కిషోర్‌కుమార్ కారు బోల్తా పడగా.. సత్యనారాయణ కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదం నుంచి ఇరువురు సురక్షితంగా బయటపడ్డారు. కిషోర్‌కుమార్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాలుడి అదృశ్యం



అఖిల్

నంబులపూలకుంట, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరివాండ్లపల్లికి చెందిన నారాయణ తన ఏడేళ్ల కుమారుడు అఖిల్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటకెళ్లిన అఖిల్ తిరిగిరాలేదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో వైర్ చోరీ

కదిరిఅర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నగారిపల్లిలో చిన్నరెడ్డెప్ప పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని 70 కేజీల కాపర్ వైర్ శనివారం రాత్రి చోరీకి గురైంది. ఏఈ గౌరీశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేపట్టామని రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ప్రమాదం

కొత్తచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన దామోదర్ సోమవారం రాత్రి మద్యం మత్తులో టెంపో వాహనాన్ని అతి వేగంగా నడపడంతో పలువురు గాయపడ్డారు. దామోదర్ టెంపోలో అతి వేగంగా వెళ్తూ.. కొత్తచెరువు సర్కిల్ పరిధిలో ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. అదే వేగంతో వాహనాన్ని నడుపుతూ వెళ్తూ.. లోచర్ల సమీపంలోని కుంటెమ్మ దేవాలయం వద్ద రోడ్డుకు ప్రక్కన ఉన్న ద్విచక్రవాహనాలను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదాల్లో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. అదే వేగంతో ఓ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై వెళ్తున్న లోచర్లకు చెందిన బాబు అనే వ్యక్తి కాలు విరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అప్ గ్రేడ్ ఇన్‌చార్జ్ సీఐ సురేష్ తెలిపారు.

● మహిళకు గాయాలు

కొత్తచెరువు మండలంలోని లోచర్ల గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా సోమవారం రాత్రి ఢీ కొన్న ప్రమాదంలో బండమీదపల్లికు చెందిన లక్ష్మీదేవికి కాలు విరిగింది. శ్రీనివాసులు తన భార్య లక్ష్మీదేవితో కలిసి ద్విచక్రవాహనంలో కొత్తచెరువు నుంచి లోచర్లకు బయలుదేరాడు. లోచర్ల గ్రామ సమీపంలో పూల శివ ద్విచక్రవాహనంలో ఎదురుగా వచ్చి .. ఢీకొన్నాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంపీ క్రిష్ణమూర్తి, మల్లె రమేష్ తెలిపారు. ఈ శిబిరంలో కంటిలో నీరు కారడం, కంటిలో దురద, తదితర కంటి సమస్యలకు పరీక్షలు చేసి, మందులు అందచేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ కూడా నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఫోన్‌నెంబర్ తప్పకుండా తీసుకురావాలన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా గుట్టే లక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు



అమ్మవారికి పూజలు జరిపిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్/గుడిబండ/రొళ్ల, మే5(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండల సమీపంలోని పిల్లిగుండ్లు కర్ణాటక సరిహద్దున వెలసిన గుట్టే లక్ష్మీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు, నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విమానగోపుర ప్రతిష్ఠాపన, హోమాలు, విశేష అలంకరణ, జలధి మహోత్సవం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల నడుమ అమ్మవారి జలధి ఉత్సవం చేపట్టారు. అమ్మవారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి ప్రత్యేక పూజలు జరిపించారు, అమ్మవారి జలధి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

మడకశిర టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవం మంగళవారం నుం చి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సింహాచల భజన బృందంచే 12గంటల పాటు భజన కార్యక్రమంతో పాటు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం కాగడ హారతి, 6.30గంటలకు శాంతిహోమం, 8.30 గంటలకు ప్రాకారోత్సవం, 9 గంటలకు పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గొర్రెపల్లిలో కాఫీ విత్ వైసీపీ



వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతున్న ఉషశ్రీ

పరిగి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొర్రెపల్లిలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైసీపీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గుడ్‌మార్నింగ్ అంటూ ప్రజలతో మమేకమై కాఫీ తాగుతూ వారిని పలకరించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కల్లుమర్రి చెరువు మలుపు వద్ద రోడ్డుపైకి వచ్చిన కంపచెట్లు

మడకశిర రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మడకశిర-హిందూపురం ప్రధాన రహదారిలో కల్లుమర్రి చెరువు మలుపు వద్ద కంపచెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. ప్రధాన మలుపు ఉండడంతో అటువైపునుంచి వచ్చే వాహనాలు కనిపించవు. ఈ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారలు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు చేపట్టి కంపచెట్లు తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

అగళి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిపల్లిలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో ఇటీవల కొల్లాపురి మహాలక్ష్మీ దేవి జాతర ఉత్సవాల సందర్భంగా ఎస్సీ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఓ వర్గానికి చెందిన నరసింహమూర్తి అనే వ్యక్తి మృతిచెందాడు. అప్పటి నుంచి గ్రామంలో ఎస్‌ఐ వీరేష్ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఒక్కో వర్గం నుంచి 15మంది బైండోవర్ చేసి తహసీల్దార్ ముందు హాజరు పరిచారు. ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. గతనెల 28నుంచి ఇప్పటి వరకు పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

తలరాత మార్చే శక్తి విద్యకే ఉంది

● అంత్యోదయ కాన్వెంట్ కార్యదర్శి మునిస్వామి



మునిస్వామిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

పావగడ, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి తలరాతను మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని మంగళవాడ అంత్యోదయ కాన్వెంట్ కార్యదర్శి మునిస్వామి అన్నారు. సోమవారం గురుకుల పాఠశాలలో ఇటీవల టెన్త్‌లో 90శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పది తరువాత కళాశాలల్లో అడుగుపెట్టిన మీ తలరాతను మార్చే శక్తి విద్యకే సాధ్యమన్నారు. మొత్తం 65మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. గురుకుల పాఠశాల కార్యదర్శి నాగభూషణ, సంస్థ అధ్యక్షులు ప్రసన్నమూర్తి, సహన కాన్వెంట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు మునిస్వామిని ఘనంగా సన్మానించారు.

దౌర్భాగ్యం..!



గొర్రెల పెంపక క్షేత్రంపై తీవ్ర నిర్లక్ష్యం

- వేల జీవాలతో వెలుగొందిన ఫాం..
- ప్రస్తుతం వందలతో సరి..
- భూములు ధారాదత్తం
- వేధిస్తున్న సిబ్బంది, నిధుల కొరత
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గొర్రెల పెంపక క్షేత్రంలో నెల్లూరు జాతి గొర్రెలు

పెనుకొండ టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లా రైతుకు పాడి, గొర్రెల పెంపకం ప్రధాన ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు. చాలామందికి గొర్రెల పెంపకం జీవనాధారంగా కూడా మారింది. పంటలు సాగుచేసి నష్టపోతున్న రైతులు గొర్రెల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. లాభాలు కూడా గడిస్తున్నారు. ప్రభుత్వాలు సైతం గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. పలు సబ్సిడీలు కూడా అందజేస్తున్నాయి. జిల్లా రైతును ఆదుకునేందుకు ఉన్నతాశయంతో పెనుకొండ వద్ద ఏర్పాటు చేసిన గొర్రెల పెంపక క్షేత్రం (షీప్ ఫాం)పై మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు విదేశీ జాతి గొర్రెలను పెంచేందుకు సైతం అనువుగా ఉన్నాయని నిర్ధారించారు. విదేశీ గొర్రెలను పెంచాలని కూడా నిర్ణయించారు. అది కార్యరూపం దాల్చలేదు. స్వదేశీ జాతి గొర్రెల పెంపకంతోనే సరిపెట్టారు. అవి కూడా గతంలో వేల సంఖ్యలో గొర్రెలను పెంచేవారు. రానురాను షీప్ ఫాంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం వందల్లోనే గొర్రెలున్నాయి. వాటి షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు చేసేవారు కరువయ్యారు. సిబ్బంది లేరు. నిధులు కూడా లేవు. గొర్రెల పెంపకం క్షేత్రం భూములను ఇష్టారాజ్యంగా ఇతర అవసరాలకు ధారాదత్తం చేస్తున్నారు. వెరసి.. గొర్రెల పెంపకం క్షేత్రం మూసివేతకు అడుగులు పడుతున్నాయన్న ఆవేదనలు వ్యక్తమవుతున్నాయి.



గొర్రెల పెంపక క్షేత్రం భూమి

భూములు అప్పగించేస్తున్నారు..

గొర్రెల పెంపక క్షేత్రానికి సంబంధించి 578 ఎకరాల భూమి ఉంది. అందులో ఎకరాల కొద్దీ ఇతర అవసరాలకు అప్పగించారంటే షీప్ ఫాం అభివృద్ధిపై ఏపాటి శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. మెడికల్ కళాశాలకు 60, జగనన్న లేఅవుట్‌కు 32, గురుకుల పాఠశాలలకు ఎనిమిది ఎకరాలు తీసుకున్నారు. ఇంకా ఏ ప్రభుత్వ కార్యాలయాలకు భూమి కావాలన్నా ఈ క్షేత్రానికి సంబంధించిన భూమినే అధికారులు సిఫార్సు చేస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

షీప్ ఫాంలో గతంలో వేల సంఖ్యలో గొర్రెలను పెంచేవారు. ప్రస్తుతం 600 గొర్రెలు మాత్రమే ఉన్నాయి. ఈ క్షేత్రంలో దాదాపు 8 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం డీడీ, సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, మరో ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారు. గొర్రెలను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లేందుకు 20మంది దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. గొర్రెలు వ్యాధుల బారినపడితే చికిత్స అందించేందుకు కనీసం వైద్యుడు కూడా లేడు. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంటే గొర్రెల ఉత్పత్తి పెరుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆస్ట్రేలియా తరహా వాతావరణం

పెనుకొండకు 3కి.మీ. దూరంలో ఉన్న ప్రాంతం ఆస్ట్రేలియా తరహా వాతావరణం కలిగి ఉండటంతో 1959లో 578 ఎకరాల విస్తీర్ణంలో గొర్రెల పెంపక క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. గొర్రెలకు అనువైన షెడ్లు, సిబ్బంది ఉండటానికి ఇళ్లు నిర్మించారు. ఇక్కడ ఫ్రెంచ్, మెరినో, కరిడేల్, బళ్లారి(డక్కెన్) తదితర జాతుల గొర్రెలను పెంచాలని ఏర్పాటు చేశారు. ఆ గొర్రెపిల్లలను రైతులకు విక్రయించాలనుకున్నారు. వాటి నుంచి లభించే ఉన్నితో నాణ్యమైన వస్త్రాలు తయారు చేయాలని భావించారు. క్రమేణా వాతావరణంలో అనూహ్య మార్పులు రావడం, ఉష్ణోగ్రత లు పెరిగి ఈ జాతి అభివృద్ధి చెందలేదు. నెల్లూరుకు చెందిన యర్రబల్లి (బ్రౌన్) జాతి గొర్రెల పెంపకం చేపట్టారు.

అటకెక్కిన అయ్యప్పన్ కమిటీ సిఫార్సులు

2012లో అయ్యప్పన్ కమిటీ ఈ క్షేత్రాన్ని పరిశీలించింది. ఇక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకుంది. అభివృద్ధికి అవసరమైన అంశాలను గుర్తించింది. అంతలోనే ప్రాజెక్టు అనంత అటకెక్కడంతో గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధి చర్యలు ఆగిపోయాయి. ఇక్కడే గొర్రెల పెంపకందారులకు శిక్షణ ఇచ్చే కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసింది. అవి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాయి. ప్రస్తుతం అరకొరగా గొర్రెల పెంపక క్షేత్రం సాగుతోంది.

ప్యూర్ బ్రీడ్ ఉత్పత్తి కేంద్రానికి ఈ ప్రాంతం అనువు

గొర్రెల పెంపక క్షేత్రం వద్ద వాతావరణం వాటి పెంపకానికి అనువుగా ఉంటోంది. ఏటా ఎనిమిది లక్షల రూపాయలు ఈ క్షేత్రం నుంచి ఆదాయం వస్తుంది. ప్రస్తుతం 14ఎకరాల్లో గొర్రెల కోసం గడ్డిని పెంచుతున్నాం. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి, నిధులు విడుదల చేస్తే అధికంగా ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. వాటిని జిల్లాలోని గొర్రెల పెంపకందారులకు అప్పగించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటక నుంచి గొర్రెపిల్లలను తెచ్చుకుని మేపుతున్నారు.

- కాంతమ్మ, డీడీ, గొర్రెల పెంపక క్షేత్రం

హామీలు నెరవేరుస్తున్నాం: మంత్రి సవిత

సోమందేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. సోమవారం మండలంలోని నడింపల్లి, వెలగమాకులపల్లి గ్రామాల్లో రూ.30లక్షలతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ శవరాజకీయాలు చేయడం జగన్‌కు అలవాటన్నారు. అధికారం కోసం ఎంతకైనా దిగజారి రాజకీయాలు చేస్తారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిన జగన్, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషాన్ని చిమ్ముతున్నారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 60ఓవర్‌హెడ్ ట్యాంకులు మంజూరయ్యాయన్నారు. దాదాపు రూ.30కోట్లతో దశలవారిగా నిర్మిస్తామన్నారు. సోమందేపల్లిలో ఏడు ఓవర్‌హెడ్ ట్యాంకులకు రూ.4కోట్లు మంజూరయ్యాయన్నారు. నేడు మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సోమందేపల్లిలో రూ.1.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామన్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మాజీ ఎంపీపీ వెంకటేశులు, నాయకులు నీరుగంటి చంద్ర, వెంకటరమణ, సిద్దలింగప్ప, సూరీ, కిష్టప్ప, సూర్యనారాయణ, నరసింహులు, భువనకీర్తి, నాగరాజు పాల్గొన్నారు.



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

కిశోరీ వికాసంతో బాలికల సర్వతోముఖాభివృద్ధి

పెనుకొండ: కిశోరీ వికాసంతో బాలికల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత సూచించారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గర్భిణులకు పౌష్టికాహారం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కిశోరీ వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దీని ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలుతీసుకోవాలని, బాలికలు స్కూల్ డ్రాప్‌అవుట్ కాకుండా చూడాలన్నారు. సీడీపీఓ శాంతలక్ష్మి, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ శ్రీనాథ్, కమిషనర్ సతీష్‌కుమార్, టీడీపీ నాయకులు నారాయణస్వామి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డితోపాటు అంగనవాడీ కార్యకర్తలు, వెలుగు సభ్యులు, వెల్ఫేర్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెనుకొండ: విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి సవిత సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. సోమవారం రొద్దం పర్యటనలో భాగంగా మంత్రి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి కులగణన



కులగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, బీఈఓ

పావగడ, మే 5(ఆంధ్రజ్యోతి): ఏబీసీడీ వర్గీకరణ కోసం కర్ణాటక ప్రభుత్వం సుప్రీకోర్టు ఆదేశాలకు స్పందించి మంగళవారం నుంచి ప్రతి ఇంటా కులగణన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ వరదరాజు, బీఈఓ ఇంద్రాణమ్మ తెలిపారు. ప్రతి ఊరికి అధికారులు వచ్చి ఇంటింటా కులగణన చేపట్టి జాతీయ నమోదు ప్రణాళిక ప్రకారం నమోదు చేసేందుకు మీ ఇంటివద్దకు వస్తారని, వారికి సహకరించి రేషన్‌కార్డు ద్వారా కార్డులో ఉన్న ప్రతి ఒక్కరినీ జనాభాలెక్కల్లోకి చేర్పించడానికి కృషిచేయాలన్నారు. మంగళవారం నుంచి 17వ తేదీ వరకు కార్యక్రమం చేపట్టనున్నారని ప్రతి ఒక్కరూ తమ మూల జాతిని చేర్పించి సహకరించాలన్నారు.

విద్యతోపాటు నైపుణ్యం అవసరం

హిందూపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చదువుతోపాటు నైపుణ్యం ఉండాలని మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అన్నారు. సోమవారం ఎస్‌ఎస్‌పీఆర్‌లు జవహర్ నాలెడ్జ్ సెంటర్, జేకేసీ, టాటా ఎలక్ట్రానిక్స్ సంయుక్తంగా సోమవారం జాబ్‌మేళ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినులు జాబ్‌చేస్తూ ఆర్థిక స్వావలంబనతోనే సమాజంలో విలువ ఉంటుందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎల్‌ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్, కోఆర్డినేటర్లు శ్రీలక్ష్మీ, జేసీ కోఆర్డినేటర్ రవికుమార్, రవినాయక్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల బృందం

సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ధర్నా

పెనుకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట పాతతాలూకా జోనల్ పార్టీలు మల్లికార్జున ఒక రోజు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీటీఎఫ్ జోనల్ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. పీఆర్సీ కమిటీని వెంటనే వేయాలని, 30శాతం ఐఆర్ ప్రకటించాలని సీపీఎస్ రద్దుచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరుచేయాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ117ను రద్దుచేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తుంటే ఆ జీవోను రద్దుచేయకుండా గతంలో ఆరు రకాలున్న పాఠశాలలను ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిదిరకాల పాఠశాలలు మారుస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని నిరసన వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమానికి సత్యసాయిజిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి రవిచంద్ర సంఘీభావం తెలిపి ప్రసంగించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ గిరిధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, గోపాల్ వెంకటరమణనాయక్, ఆంజనేయులు, చంద్రమౌళి, సంజీవరాయుడు, రఘునాథ్‌రావు, జువాజినాగరాజు, వసంతలక్ష్మి, గౌరీశ్వరి రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే బాలకృష్ణ



డైనింగ్ హాల్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, వసుంధరా దేవి

చిలమత్తూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని టేకులోడు ఎంజేపీ గురుకుల పాఠశాలలో రూ.85 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పనులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రధానంగా విద్యా, వైద్యం, రోడ్లు, భవనాలు తదితర ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేపడుతున్నామన్నారు. గతంలో ఈ పాఠశాలను సందర్శించిన సమయంలో డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని దాంతో వెంటనే ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధర దేవి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. మండల కన్వీనర్ రంగారెడ్డి, శ్రీదేవి, బాలాజీ, బేకరీ గంగాధర్, చెక్‌పోస్టు నంజుండప్ప, నందీషప్ప, అశ్వర్థప్ప, నాగేంద్ర ఉన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం: టీడీపీ మండల నాయకుడు నాగరాజుయాదవ్ ఇంటికి ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధర దేవి వెళ్లి నూతన వధూవరులు లోకేష్‌యాదవ్, చందనదీప్తిలను ఆశీర్వదించారు. ఇటీవల నాగరాజుయాదవ్, ఆయన సోదరుడు లక్ష్మినారాయణ యాదవ్ హైదరాబాదు వెళ్లి ఎమ్మెల్యే దంపతులను పెళ్లికి అహ్వానించారు. పెళ్లికి హాజరుకాకపోవడంతో సోమవారం వారి ఇంటికి ఎమ్మెల్యే దంపతులు విచ్చేశారు. దీంతో జడ్పీటీసీ అనేష దంపతులు ఎమ్మెల్యే బాలకృష్ణని, వసుంధర దేవిలను సాదరంగా స్వాగతం పలికారు. నూతన వధూవరులను పలకరిస్తూ వారికి ఆశీర్వాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బహుజన చైతన్యం కోసమే కవియాత్ర

పెనుకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): కవిత్వం మనుగడ కోసం, కవితా సాధన కోసం, తెలుగుభాష వికాసం కోసం, కవులను కలుసుకోవడం కోసం, బహుజన చైతన్యం కోసం కవి యాత్ర నిర్వహిస్తున్నట్లు యాత్ర నిర్వాహకుడు రఘువీర ప్రసాద్ తెలిపారు. సోమవారం నల్గొండకు చెందిన విశ్వం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కవియాత్ర బృందం పెనుకొండకు చేరుకుంది. బృందానికి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, మండల అధ్యక్షుడు కోగిర జయచంద్ర స్వాగతం పలికారు. అనంతరం కవియాత్ర బృందం రాయల వేసవివిడిది గగన్‌మహల్, ఇతర ప్రాచీన కట్టడాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి దాదాపు అర్ధశతాబ్దం నుంచి విశ్వం ఫౌండేషన్ కవియాత్ర కొనసాగిస్తుందన్నారు. కవిత్వాన్ని బతికిస్తూ విజయనగర సామ్రాజ్యం రెండో రాజధాని పెనుకొండకు చేరుకున్నామన్నారు. అనంతరం గగన్‌మహల్‌లో భువనవిజయాన్ని తలపించేలా కవి సమ్మేళనం నిర్వహించారు. కవితా బృందంలో రఘువీరప్రతాప్, డా. కృష్ణకౌంటిర్య, దాసోజి శ్రీనివాసులు, దాసోజి శ్రవణ్‌కుమార్, దాసోజి జ్ఞానేశ్వర్, దాసోజి రవికుమార్, నరసింహాచార్యులు, ఆంజనేయులు పాల్గొన్నారు. పెనుకొండ ఔన్నత్యాన్ని వారు కొనియాడారు.

ప్రహరీ సమస్య పరిష్కరించండి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసి

సోమందేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీనగర్‌కు రాకపోకలు కొనసాగించే దారిలో 2వ తేదీన కురిసిన వర్షానికి నీరునిలిచి ఓ ఇంటి ప్రహరీ నెర్రెలు చీలి ప్రమాదకరంగా ఉందని కాలనీ వాసులు అంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డీటీ రెడ్డిశేఖర్‌కు కాలనీ ప్రజలు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ వంకలో అక్రమ నిర్మాణాలవల్ల వర్షపు నీరు నిలుస్తోందన్నారు. దీనికితోడు వర్షపునీరు నిలిచేలా దోహదపడుతుందన్నారు. ప్రహరీ ఎప్పుడు కూలుతుందో తెలియక భయం భయంగా సంచరిస్తున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజలు త్రివేణి, శివారెడ్డి, సుమిత్ర, గంగాధర్ ఉన్నారు.

సంపులో పడి వ్యక్తి మృతి



గంగాధర్ (ఫైల్)

పరిగి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో సోమవారం గంగాధర్ (35)అనే వ్యక్తి నీటి సంపులో పడి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు మధుగిరి ప్రధాన రహదారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లే దారి పక్కన మామిడితోటలో పని చేసే గంగాధర్ అనే వ్యక్తి సంపులోపడి మృతిచెందాడు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో పదడుగుల సంపులో కాలుజారిపడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి స్వగ్రామం కల్లుమర్రిగా తెలిపారు. సంపులో మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



హనుమంతరాయప్ప (ఫైల్)

అమరాపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేలుబండ గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప(30) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం మిడిగేసి గ్రామానికి పెళ్లి నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యలో ద్విచక్రవాహనం నుంచి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు తుమకూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు భార్య ప్రమీ తెలిపారు. టీడీపీ కార్యకర్త మృతిచెందాడన్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. హనుమంతరాయప్ప కుటుంబానికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందన్నారు. మాజీ సర్పంచ్ ఈరన్న, క్లస్టర్ ఇన్చార్జ్ ప్రభు, చెరువుసంఘం అధ్యక్షులు వీరమల్లప్ప పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అగళి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలం మధూడి గ్రామ సమీపంలో సోమవారం జూదమాడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి నుంచి రూ.1,600 స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ బషీర్, శ్రీరాములు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన తప్పవన్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రాకు పెంకు మట్టిని తరలిస్తున్న లారీ పెనుకొండ సమీపంలోని మడకశిర పేట్లపై అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరు కర్ణాటక వాసులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన డ్రైవర్ బాలరాజు, క్లీనర్ నరసింహమూర్తి మంగళూరు నుంచి లారీలో పెంకులు తయారుచేసే మట్టిని తాడిపత్రికి తరలిస్తున్నారు. పెనుకొండ సమీపంలోని మడకశిర పేట్లపై లారీ అదుపుతప్పి బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.